TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 92 | బుధవారం, జూలై 31, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

## వయనాడ్‌లో భీభత్సం... 50 మంది మృతి



తిరువనంతపురం: కేరళలోని వయనాడ్ జిల్లాలో మంగళవారం తెల్లవారు జామున భారీ కొండచరియలు విరిగిపడ్డియి. మట్టి దిబ్బల కింద వందలాది మంది చిక్కుకున్నారు. ఇప్పటి వరకు దాదాపు 50 మందికి పైగా చనిపోయారని వార్త. కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం, అగ్నిమాపక బృందం, జాతీయ విపత్తు స్పందన దళాలు రంగంలోకి దిగాయి. అదనపు బృందాలను కూడా సమీప ప్రాంతాల నుంచి రప్పిస్తున్నారు. కేరళలో కురుస్తున్న భారీ వర్షాలు సహాయకచర్యలకు అంతరాయం కలిగిస్తున్నాయి. మెప్పాడి, ముండకై ప్రాంతాల్లో విధ్వంసం తీవ్రంగా ఉంది. వెల్లర్మల పాఠశాల అయితే పూర్తిగా మునిగిపోయింది. సహాయక చర్యలకు హెలికాప్టర్ ను కూడా ఉపయోగిస్తున్నారు. వంతెన కూలడంతో అత్తమల, చురల్ మలకు రాకపోకలు నిలిచిపోయాయి. కేరళలోని వాయనాడ్ లో కొండచరియలు విరిగిపడ్డంతో తాజాగా మృతుల సంఖ్య 63కు పెరిగింది. దాదాపు 116 మంది గాయపడ్డారు. వాయనాడ్ కేరళ లోని కొండ ప్రాంతం. ఇప్పటికీ చాలా మంది శిథిలాల క్రింద ఉన్నట్లు సమాచారం. మృతుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. ఇదిలావుండగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె.స్టాలిన్ సిఎం జనరల్ రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 5 కోట్లను కేరళకు కేటాయించారు. అంతేకాకుండా కేరళకు తమిళనాడు నుంచి విపత్తు దళాలలను, డాక్టర్లను, నర్సులను, ఇద్దరు ఐఏఎస్ అధికారులను రెస్క్యూ టీమ్ గా పంపారు. కేరళకు కావలసిన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇదిలావుండగా 200 మంది భారతీయ సైనిక సిబ్బంది, 30 మంది నావీ ఈతగాళ్లు కూడా కేరళకు చేరారు. వారంతా రెస్క్యూ కార్యక్రమాలలో పాలుపంచుకుంటారు.

## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం



హైదరాబాద్: కాసేపటి క్రితమే తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. మంత్రి శ్రీధర్ బాబు స్కిల్స్ యూనివర్శిటీ బిల్లును ప్రవేశపెట్టారు. ఇంకా 19 పద్దులపై అసెంబ్లీలో చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ శాసనసభ్యులకు ఓ వినతి చేశారు. అదేమిటంటే నిన్నటిలా నేడు సుదీర్ఘ ప్రసంగాలు చేయొద్దన్నారు. విషయంపైనే మాట్లాడాలన్నారు. వ్యవసాయం, కోఆపరేటివ్, నీటిపారుదల, రోడ్స్ అండ్ బిల్డింగ్స్, పంచాయతీ రాజ్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, గృహ నిర్మాణం, పౌరసరఫరాలు, పశుసంవర్ధకం, పర్యాటకం, క్రీడాశాఖ, అటవీ, దేవాదాయ, మైనార్టీ, చేనేత, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పద్దులపై నేడు చర్చ జరుగనున్నది.

## అసెంబ్లీ సమావేశాలు 20 రోజులు నిర్వహించాలి: కేటీఆర్



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రెసిడెంట్ కెటిఆర్ నిప్పులు చెరిగారు. ఒకే రోజు 19 పద్దులపై చర్చ పెట్టడం సరికాదని మండిపడ్డారు. రోజుకో పద్దుపై చర్చిస్తే అందరూ మాట్లాడుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. శాసనసభకు కొత్తగా 50 మంది సభ్యులు వచ్చారని.. కొత్త సభ్యులకు మాట్లాడాలనే ఉత్సాహం ఉంటుందని తెలిపారు. వచ్చే అసెంబ్లీలో సమావేశాలు 20 రోజులపాటు నిర్వహించాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. మరో అధికార పక్షం, ప్రతిపక్షం మధ్య మాటల యుద్ధంతో అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్ గా కొనసాగుతున్నాయి.

## స్వంత గూటికి బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి



**హైదరాబాద్: భారతీయ రాష్ట్ర సమితి పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి ఇటీవలే చేరిన గద్వాల ఎంఎల్‌ఏ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి తిరిగి స్వంత గూటికి చేరుకున్నారు. రెండో విడత రైతు రుణ మాఫీ వేళ అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి ఆయన తిరిగి బిఆర్ఎస్ లోకి చేరారు. ఆయన మంగళవారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ను కలిసి పార్టీలో కొనసాగుతానని తెలిపారు. ఆ తర్వాత ఆయన కెటిఆర్ సమక్షంలో బిఆర్ఎస్ లో చేరారు. ఈ పరిణామం కాంగ్రెస్ కు ఊహించని ఎదురు దెబ్బ అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.**

### కేంద్ర ప్రభుత్వంపై 'సుప్రీం' ఆగ్రహం..

## రూ.2లక్షల జరిమానా..!




న్యూఢిల్లీ: సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ పథకం ప్రకారం రిటైర్డ్ రెగ్యులర్ కెప్టెన్లకు చెల్లించే పెన్షన్‌కు సంబంధించి నిర్ణయం తీసుకోవడంపై జాప్యంపై మండిపడింది. తక్షణం బకాయిలు చెల్లించాలని ఆర్మీని ఆదేశించింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పెన్షన్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోనందుకు కేంద్రాన్ని మందలించడంతో పాటు రూ. 2లక్షల జరిమానా విధించింది. పెన్షన్ విషయంలో దాఖలైన పిటిషన్లను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పదవీ విరమణ చేసిన అధికారుల పెన్షన్ చెల్లింపులో కేంద్రం విఫలమైందన్న సర్వోన్నత న్యాయస్థానం.. నవంబర్ 14 వరకు సమస్యను పరిష్కరించాలని కేంద్రానికి గడువు ఇచ్చింది. లేకపోతే పెన్షన్ పెంపుపై తామే ఆదేశాలు ఇవ్వాల్సి వస్తుందంటూ కేంద్రానికి హెచ్చరికలు చేసింది.

## బీఆర్ఎస్ పై మంత్రి సీతక్క ఫైర్..



హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీపై మంత్రి సీతక్క తీవ్ర విమర్శలు చేశారు. గత పదేళ్ల అధికారంలో ఉండి ఎస్టీలకు ఏం చేశారు? అని సీతక్క మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా సభలో మాట్లాడిన సీతక్క.. ఎస్టీలకు పోడు భూముల చట్టం ద్వారా 2006లో లబ్ధి కలిగించామని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్నా ఎస్టీలకు మీరేమీ చేయలేదని విమర్శించారు. "మీ పదేళ్ల పాలనలో ఎంతమంది ఎస్టీలకు ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలి?. బీఆర్ఎస్ పాలనలో ఎస్టీలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. నా తల్లిదండ్రులకు చట్ట ప్రకారంమే పోడు భూముల హక్కు వచ్చింది. అడవిని ఆధారంగా చేసుకుని బతికే కుటుంబాలు మావి" అని అన్నారు.

### త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా

## భారత్



న్యూఢిల్లీ: 2014కు ముందు యూపీఏ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉందని చూపేందుకు బడ్జెట్‌లో భారీ ప్రకటనలు గుప్పించేదని, క్షేత్రస్థాయిలో వాటి అమలును పట్టించుకోలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వికసిత్ భారత్ దిశగా ప్రస్థానం అనే అంశంపై కేంద్ర బడ్జెట్ 2024-25పై సీఐఐ నిర్వహించిన సదస్సులో ప్రధాని ప్రారంభోపన్యాసం చేశారు. పథకాలను పూర్తి చేసేందుకు గత ప్రభుత్వాలు శ్రద్ధ కనబరచలేదని దుయ్యబట్టారు. గత పదేండ్లుగా తాము ఆ పరిస్థితిని మార్చివేశామని ప్రధాని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే తాము రైల్వే బడ్జెట్‌ను 8 రెట్లు పెంచామని, హైవేల బడ్జెట్‌ను 8 రెట్లు, వ్యవసాయ బడ్జెట్‌ను 4 రెట్లు పెంచామని తెలిపారు. రక్షణ బడ్జెట్‌ను రెండింతలు పైగా పెంచామని చెప్పుకొచ్చారు. యూపీఏ హయాంలో లక్షలాది కోట్ల రూపాయల విలువైన అవినీతి కుంభకోణాలు వెలుగుచూసిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. తాము శ్వేతపత్రం రూపంలో దేశ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని దేశ ప్రజల ముందుంచామని చెప్పారు. మనం ఎక్కడ ఉన్నామనేదానిపై చర్చ జరగాలని చెప్పారు. భారత పరిశ్రమలను నూతన శిఖరాలకు చేర్చామని తెలిపారు. దేశ అభివృద్ధికి మూలధన వ్యయం కీలకమని 2004లో యూపీఏ తొలి బడ్జెట్‌లో మూలధన వ్యయం కేవలం రూ. 90,000 కోట్లు కాగా, ఇప్పుడు తమ ప్రభుత్వం రూ. 11 లక్షల కోట్లు పైగా మూలధన వ్యయం వెచ్చిస్తోందని ఈ నిధులతో దేశంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

### చరిత్ర సృష్టించిన మహిళా షూటర్..

## మనూ భాకర్‌పై ప్రశంసల వర్షం



పారిస్: భారత షూటర్ మనూ భాకర్ చరిత్ర సృష్టించింది. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన తొలి భారతీయ క్రీడాకారిణిగా ఆమె రికార్డు క్రియేట్ చేసింది. మనూ భాకర్ తొలుత మహిళల10మీటర్ల ఎయిర్ పిస్తోల్ ఈవెంట్‌లో, ఆ తర్వాత 10 మీటర్ల ఎయిర్ పిస్తోల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో కాంస్య పతకాలు గెలిచింది. గతంలో ఇండియా తరపున ఒకే ఒలింపిక్స్‌లో రెండు మెడల్స్ సాధించిన అథ్లెట్లలో నార్మన్ ప్రిచార్డ్ ఉన్నారు. 1900 సంవత్సరంలో జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లోనే అతను ఆ రికార్డును అందుకున్నాడు. 200 మీటర్ల హార్డిల్స్, 200 మీటర్ల రేస్‌లో.. నార్మన్ ప్రిచార్డ్ సిల్వర్ పతకాలను గెలిచారు. ఇప్పటి వరకు భారత్ తరపున రెండు ఒలింపిక్స్ పతకాలు సాధించిన వాళ్లలో ప్రిచార్డ్, సుశీల్ కుమార్, పీవీ సింధు, భాకర్ ఉన్నారు. వారిలో ప్రిచార్డ్, భాకర్ మాత్రం ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించారు. ఇక సుశీల్, సింధులు.. వేర్వేరు ఒలింపిక్స్‌లో పతకాలను కైవసం చేసుకున్నారు. 2008 బీజింగ్ ఒలింపిక్స్ లో రెజ్లర్ సుశీల్ కాంస్యం, 2012 లండన్ ఒలింపిక్స్‌లో రజత పతకాన్ని గెలుచుకున్నారు. ఇక హైదరాబాదీ షట్లర్ పీవీ సింధు.. 2016 రియో గేమ్స్‌లో సిల్వర్ మెడల్, ఆ తర్వాత టోక్యో 2020 గేమ్స్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నది. హర్యానాకు చెందిన షూటర్ మనూ మరో చరిత్ర సృష్టించే అవకాశాలు ఉన్నాయి. ఒకే ఎడిషన్‌లో మూడు మెడల్స్ గెలిచే అవకాశం ఉన్నది. 25 మీటర్ల ఎయిర్ పిస్తోల్ ఈవెంట్‌లో మనూ ప్రాతినిధం వహిస్తున్నది. రెండు పతకాలు సాధించిన షూటర్ మనూ భాకర్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. ప్రధాని మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో షూటర్ మనూ పట్ల గర్వంగా ఉందన్నారు.

# జాడ తెలియని 600 మంది వలస కార్మికులు



తిరువనంతపురం: కేరళ లోని వయనాడ్ లోని ముండక్కై ప్రాంతంలో తేయాకు, కాఫీ, యాలకుల తోటలు విస్తారంగా ఉండడంతో ఈ తోటల్లో పని చేసేందుకు పశ్చిమబెంగాల్, అస్సాం నుంచి వందల కార్మికులు వస్తుంటారు. వీరిలో దాదాపు 600 మంది వలస కార్మికులు స్థానిక హారిసన్ మళయాళీ ప్లాంటేషన్ లిమిటెడ్‌లో పనిచేయడానికి వచ్చారు. వీరంతా ముండక్కై లోనే ఉంటున్నారు. ఇప్పుడు కొండచరియలు విరిగి పడిన విషాద సంఘటన తరువాత వీరి జాడ తెలియక పోవడంతో అధికారులతోపాటు అన్ని వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. . కంపెనీ జనరల్ మేనేజర్ బెనిల్ జోన్స్ వారి ఆచూకీ గురించి ఎంత ప్రయత్నిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. మా కార్మికులు ఎవరినీ ఇప్పటివరకు సంప్రదించలేక పోయామని జోన్స్ చెబుతున్నారు. మొబైల్ ఫోన్ నెట్‌వర్క్‌లు కూడా పనిచేయడం లేదని ఆయన ఆందోళన చెందారు. ఈ విషాద సంఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి మృతదేహాలు చాలావరకు మల్లప్పురం చలియార్ నదిలో తేలియాడుతున్నట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ప్రమాదస్థలానికి చాలా దూరంలో దాదాపు 11 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. అటవీ ప్రాంతం లోకి ఐదు మృతదేహాలు కొట్టుకువచ్చాయని స్థానిక ఆదివాసీలు తెలిపారు. ఎమ్ఎల్ఎ ఐసీ బాలకృష్ణన్ కూడా నదిలో అనేక శవాలు తేలుతున్నాయని చెప్పారు. ముండక్కై గ్రామంలో పరిస్థితి భయానకంగా ఉందని కాల్పెట్టా ఎమ్ఎల్ఎ టి సిద్ధిఖీ పేర్కొన్నారు.

## లోక్ సభలో అనురాగ్ ఠాకుర్ పై...

# విరుచుకుపడ్డ రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ: ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మంగళవారం లోక్ సభలో బిజెపి ఎంపీ అనురాగ్ ఠాకుర్ పై విరుచుకుపడ్డారు. తనను అవమానించారని మండిపడ్డారు. అనురాగ్ ఠాకుర్ "ఎవరికైతే తమ కులం కూడా తెలియదో వారు కుల గణన గురించి మాట్లాడుతున్నారు" అన్నారు. దీనిపై రాహుల్ గాంధీ స్పందిస్తూ "ఎవరైతే ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వారికి సంబంధించిన సమస్యలు లేవనెత్తుతారో వారిని కించపరుస్తున్నారు" అన్నారు. "కులం తెలియని వారు కూడా కుల గణన గురించి మాట్లాడుతున్నారు. ఈ సభలోనే మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ (RG-1) OBCలకు రిజర్వేషన్‌ను వ్యతిరేకించారని నేను స్పీకర్‌కు గుర్తు చేయాలనుకుంటున్నాను" అని బిజెపి ఎంపి అనురాగ్ ఠాకూర్ సభలో అన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కుల గణన చేపడతామని దేశానికి హామీ ఇచ్చిన రాహుల్ గాంధీ తన వాగ్దానాన్ని పునరుద్ఘాటించారు. "మీరు ఎంత కావాలనుకుంటే అంతగా నన్ను అవమానించవచ్చు, కానీ మేము పార్లమెంటులో కుల గణనను పాస్ చేస్తాము" అని రాహుల్ గాంధీ అన్నారు. తర్వాత ఠాకూర్ తన వ్యాఖ్యల్లో ఎవరి పేరును ప్రస్తావించలేదని చెప్పారు. "కులం గురించి తెలియని వ్యక్తి కుల గణన గురించి మాట్లాడుతున్నారని నేను అన్నాను, కానీ నేను ఎవరి పేరు ప్రస్తావించలేదు" అని అనురాగ్ ఠాకూర్ తెలిపారు. కానీ తర్వాత రాహుల్ గాంధీ , ఠాకూర్ తనను దుర్భాషలాడారని, అవమానించారని ఆరోపించారు. అయితే ఆయన నుంచి తాను క్షమాపణలు కోరుకోవడం లేదన్నారు.

2024 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రధాన హామీల్లో కుల గణన ఒకటి. ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ దీనిని భారతదేశం యొక్క ఎక్స్-రే అని పిలిచారు. " దేశంలో ఎంత మంది వెనుకబడినవారు, దళితులు, గిరిజనులు ఉన్నారో ఎవరికీ తెలియదా? జనాభాలో అత్యధికంగా ఉన్న వారికి వారి సంఖ్య తెలియదు. బిజెపి ప్రభుత్వానికి కులాల డేటా అక్కర్లేదు. కానీ వివిధ కుల సమూహాల జనాభాను నిర్ధారించడానికి మేము భారతదేశం యొక్క ఎక్స్-రేను పొందుతాము. కుల గణన పూర్తయితే దేశం మారిపోతుంది' అని రాహుల్ గాంధీ అన్నారు. కాగా కుల ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని బిజెపి ఆరోపించింది.

## జార్ఖండ్ రైలు ప్రమాదంపై సచిన్ పైలట్

# కీలక వ్యాఖ్యలు




జార్ఖండ్‌లోని చక్రధర్‌పూర్ వద్ద రైలు ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం హౌరా - సీఎస్ఎంటీ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా.. 20 మందికిపైగా ప్రయాణికులు గాయపడ్డారు. దేశంలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న రైలు ప్రమాదాలతో మోదీ సర్కార్ లక్ష్యంగా విపక్ష నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. జార?ండ్ రైలు ప్రమాద ఘటనపై కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ మాట్లాడుతూ ఎవరు అధికారంలో ఉన్నా ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడమే తొలి ప్రాధాన్యతగా ఉండాలని అన్నారు.

ప్రజా రవాణా విషయంలో భద్రత అత్యంత కీలకమని పేర్కొన్నారు. గత కొద్దినెలలుగా నిరోధించతగిన రైలు ప్రమాదాలు వెలుగుచూడటం బాధాకరమని సచిన్ పైలట్ అన్నారు. ఇక జార్ఖండ్ రైలు ప్రమాద ఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఇటీవల రైలు ప్రమాద ఘటనలు సర్వసాధారణమైపోయాయన్నారు. ప్రతివారం ఏదో ఒకచోట ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. 'మరో ఘోరమైన రైలు ప్రమాదం..! ఈ రోజు తెల్లవారుజామున జార్ఖండ్‌లోని చక్రధర్‌పూర్ డివిజన్‌లో హౌరా - ముంబై మెయిల్ పట్టాలు తప్పింది. ఈ ఘటనలో కొందరు చనిపోగా.. భారీ సంఖ్యలో గాయపడ్డారు. దేశంలో రైలు ప్రమాద ఘటనలు సర్వసాధారణమైపోయాయి. ప్రతి వారం ఏదో ఒకచోట ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ విషయంలో నేను ప్రభుత్వాన్ని గట్టిగా అడుగుతున్నాను.. ఇంకా ఎంతకాలం వీటిని సహించాలి. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి అంతం ఉండదా..?' అని ఎక్స్ వేదికగా మోదీ సర్కార్‌ను దీదీ నిలదీశారు.

# జార్ఖండ్‌లో పట్టాలు తప్పిన హౌరా-ముంబై మెయిల్..ఇద్దరు మృతి



జార్ఖండ్‌లోని సెరైకెలా-ఖారవాన్ జిల్లాలో మంగళవారం తెలవారుజామున హౌరా-ముంబై మెయిల్‌కు చెందిన 18 బోగీలు పట్టాలు తప్పడంతో ఇద్దరు ప్రయాణికులు మరణించగా మరో 20 మంది గాయపడ్డారు. ఆగ్నేయ రైల్వేలోని చక్రధర్‌పూర్ డివిజన్ పరిధిలోకి వచ్చే బారాబంబూ సమీపంలో తెల్లవారుజామున 3.45 గంటలకు ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికారులు తెలిపారు. జంషెడ్‌పూర్‌కు 80 కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన జరిగింది. సమీపంలోనే మరో గూడ్సు రైలు కూడా పట్టాలు తప్పిందని, అయితే ఈ రెండు ప్రమాదాలు ఒకేసారి జరిగిందీ లేనిదీ తెలియరాలేదని ఆగ్నేయ రైల్వే అధికార ప్రతినిధి ఓం ప్రకాష్ చరణ్ విలేకరులకు తెలిపారు. హౌరా-ముంబై మెయిల్ ప్రమాదంపై దర్యాప్తునకు రైల్వే ఆదేశించినట్లు ఆయన చెప్పారు. బారాబంబూ సమీపంలో హౌరా-ముంబై మెయిల్‌కు చెందిన 18 బోగీలు పట్టాలు తప్పడంతో ఇద్దరు వ్యక్తులు మరణించారని, మరో 20 మంది ప్రయాణికులు గాయపడ్డారని పశ్చిమ సింగ్‌భం డిప్యూటీ కమిషనర్ కుల్దీప్ చౌదరి ప్రమాద స్థలి వద్ద విలేకరులకు తెలిపారు. హౌరా-ముంబై మెయిల్ ఆగి ఉన్న గూడ్సు రైలును ఢీకొందని ఆయన వెల్లడించారు. క్షతగాత్రులకు బారాబంబూలో ప్రాథమిక చికిత్స అందచేసి మెరుగైన చికిత్స కోసం చక్రధర్‌పూర్‌కు తరలించినట్లు రైల్వే అధికారి ఒకరు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను రైల్వే శాఖ ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారికి రూ. 5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ. 1 లక్ష చొప్పున పరిహారాన్ని ప్రకటించినట్లు చక్రధర్‌పూర్ సీనియర్ డిసిఎం తెలిపారు. సహాయక చర్యలు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

# 'అవును మేం చక్రవ్యూహం నిర్మించాం'..

## రాహుల్‌గాంధీ వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి కౌంటర్



న్యూఢిల్లీ: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు హాని తలపెట్టేలా చక్రవ్యూహాన్ని నిర్మించిందని, ఆ చక్రవ్యూహాన్ని తాము ఛేదిస్తామని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి కౌంటర్ ఇచ్చారు. అవును రాహుల్‌గాంధీ చెప్పినట్లుగానే తాము చక్రవ్యూహం నిర్మించామని ఆయన అన్నారు. అయితే రాహుల్ ఆరోపించినట్లుగా తమది ప్రజలకు హానిచేసే చక్రవ్యూహం కాదని, కాంగ్రెస్ పార్టీ అవినీతి, కుంభకోణాలను కట్టడిచేసే చక్రవ్యూహమని చెప్పారు. తాము అవినీతిని ఏ మాత్రం సహించబోమని మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు. రాహుల్‌గాంధీ, ఆయన తల్లి సోనియాగాంధీ 10 ఏళ్లు రిమోట్ కంట్రోల్‌తో ప్రభుత్వాన్ని నడిపించారని, అప్పుడు కులగణన ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు లేని కులగణన ప్రస్తావన ఇప్పుడు ఎందుకని, ఇదంతా ఒక డ్రామా అని జోషి మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ 60 ఏళ్లుగా చేసిన అవినీతిని, కుంభకోణాలను కప్పిపుచ్చుకోవడానికి రాహుల్‌గాంధీ డ్రామాలు ఆడుతున్నారని కేంద్ర మంత్రి ఆరోపించారు. బడ్జెట్‌పై చర్చలో భాగంగా రాహుల్‌గాంధీ సోమవారం లోక్‌సభలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు. అంబానీ, అదానీ లాంటి పెట్టుబడిదారులను.. ఈడీ, సీబీఐ లాంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను.. అధికార పీఠం కూలకుండా ఉండేందుకు అవసరమైన మిత్రపక్ష రాజకీయ పార్టీలను.. ప్రజాస్వామ్య విరుద్ధంగా మచ్చిక చేసుకుని కేంద్రం చక్ర వ్యూహం నిర్మించిందని ఆరోపించారు. ఆ చక్రవ్యూహాన్ని తాము ఛేదించి తీరుతామని సభలో శపథం చేశారు.

## మరో కొత్త ఫోన్ ను తీసుకొచ్చిన జియో.. ధర ఎంతంటే?





న్యూఢిల్లీ: జియో నుంచి మరో కొత్త ఫోన్ విడుదలైంది. జియో భారత్ జే1 పేరుతో 4జీ లెవల్ ఫీచర్ ఫోన్‌ను తీసుకొచ్చింది. జియో టీవీ, జియో సినిమా, జియో పే వంటి ప్రీ- ఇన్‌స్టాల్డ్ యాప్స్‌తో ఈ ఫోన్ వస్తోంది. జియో తక్కువ ధరలో అందించే జియో భారత్ ప్రత్యేక ప్రీపెయిడ్ ప్లాన్లతో దీన్ని రీఛార్జి చేసుకోవచ్చు.

ఈ కొత్త ఫోన్ ధరను రూ.1799గా నిర్ణయించారు. అమెజాన్‌లో దీన్ని కొనుగోలు చేయొచ్చు. 2,500 ఎంఏహెచ్ బ్యాటరీ, 3.5 ఎంఎం జాక్ ఉంది. క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసేందుకు డిజిటల్ కెమెరా యూనిట్‌ను ఇచ్చారు. 2.8 అంగుళాల డిస్‌ప్లే అమర్చారు. ఫిజికల్ కీబోర్డుతో వస్తున్న ఈ ఫోన్.. థ్రెడ్స్ఎక్స్ ఆర్‌టీఓఎస్‌తో పనిచేస్తుంది. 0.13జీబీ స్టోరేజీ ఉంది. ఎస్‌డీ కార్డుతో 128జీబీ వరకు పెంచుకోవచ్చు.

# హైదరాబాద్ బయోలాజికల్ ఈ పోలియో వ్యాక్సిన్‌కు ప్రీ క్వాలిఫికేషన్ హోదా ఇచ్చిన WHO..!

హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బయోలాజికల్-ఈ లిమిటెడ్ నోవెల్ ఓరల్ పోలియో వ్యాక్సిన్ టైప్ 2 కి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రీ-క్వాలిఫికేషన్ ఇచ్చింది. ఈ విషయాన్ని కంపెనీ మంగళవారం వెల్లడించింది. నోటి ద్వారా వేసే వ్యాక్సిన్ పోలియో వైరస్ వ్యాప్తిని ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని కంపెనీ పేర్కొంది. పోలియోపై పోరాటంలో కీలకమైందని.. వ్యాక్సిన్ పోలియో వైరస్ టైప్-2 వ్యాప్తి ముప్పును విజయవంతంగా ఎదుర్కొంటుందని తెలిపింది. వ్యాక్సిన్ మెరుగైన జన్యు స్థిరత్వాన్ని కలిగి ఉందని.. సబిన్ పోలియో వైరస్ టైప్-2 వ్యాక్సిన్‌తో పోలిస్తే కొత్తగా వ్యాప్తి చెందే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని చెప్పింది. ఈ సందర్భంగా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మహిమా దాట్ల స్పందిస్తూ పోలియో నిర్మూలనకు ప్రపంచవ్యాప్త ప్రయత్నంలో భాగమైనందుకు తాము సంతోషిస్తున్నామన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రీ క్వాలిఫికేషన్.. పోలియో నిర్మూలనలో తమ ప్రయత్నంలో కీలకమైన మైలురాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీటీ బయోఫార్మాకు, గేట్స్ ఫౌండేషన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై పోలియో వినాశకరమైన ప్రభావాలతో ఏ ఒక్క పిల్లవాడు ప్రభావితం కాదని హామీ ఇస్తున్నామన్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది పిల్లలు, కుటుంబాలకు ఆశాదీపంగా మారుతుందని.. పోలియో వ్యాప్తి చెందుతున్న ప్రాంతాల్లో బిలియన్ డోసుల వ్యాక్సిన్‌ను అందించడం ద్వారా పోలియో రహిత ప్రపంచం కలను సాకారం చేయడంలో చాలా కీలమన్నారు. ఇండోనేషియాలోని పీటీ బయోఫార్మా సహకారంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రీ క్వాలిఫికేషన్ పొందిన తయారీదారుగా నిలిచింది. పీటీ బయోఫార్మా నుంచి పీటీబీ సాంకేతికను పొందగా.. 500 మిలియన్ల కంటే ఎక్కువ మోతాదులను ఉత్పత్తి చేసే అవకాశం ఉన్నది.




# 2025-26 నాటికి ద్రవ్య లోటు కట్టడి

## - బడ్జెట్‌పై చర్చకు బదులిచ్చిన ఆర్థిక మంత్రి




న్యూఢిల్లీ: 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సభలో మాట్లాడిన వారితో పాటు బడ్జెట్ పట్ల ఆసక్తి కనబరిచిన సభ్యులందరికీ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ధన్యవాదాలు తెలిపారు. బడ్జెట్‌లో లోక్‌సభలో జరిగిన చర్చకు మంగళవారం ఆమె బదులిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో ఈ ప్రభుత్వానికి వరుసగా మూడోసారి అధికారం కట్టబెట్టిన దేశ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. ప్రజలు తమ ప్రభుత్వంపై పెట్టుకున్న విశ్వాసాన్ని నిలుపుకుంటామని, నిలకడైన వృద్ధి రేటుతో ప్రజలే కేంద్రంగా విధానాలకు రూపకల్పన చేస్తామని తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా మనమంతా కలిసి పనిచేద్దామని నిర్మలా సీతారామన్ పిలుపు ఇచ్చారు. తాము ద్రవ్యలోటు కట్టడి లక్ష్యానికి అనుగుణంగా సాగుతున్నామని, 2025-26 నాటికి దాన్ని 4.5 శాతం దిగువకు తీసుకువస్తామని చెప్పారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాలను బడ్జెట్‌లో కేంద్రం విస్మరించిందనే ఆరోపణలపై నిర్మలా సీతారామన్ స్పందించారు.

## సంపాదకీయం

బుధవారం, జూలై 31, 2024

# ప్రపంచంలో... 3వ యుద్ధం

ప్రపంచంలో ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ గురించి తెలియని వారు ఉండరు. ఎవరూ చేయని వినూత్న ప్రయోగాలు ఆయన చేస్తుంటారు. ఎవరికీ రాని ఆలోచనలు ఆయనకు వస్తుంటాయి. దక్షిణ కొరియాపై ఎప్పుడూ ఏదో ఒక విధంగా దాడులు చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు కిమ్. ఈ క్రమంలోనే కిమ్ దక్షిణ కొరియాకు వందల కొద్ది బెలూన్లు పంపించాడు. అందులో ఆశ్చర్యపోవడానికి ఏముంది. కిమ్ పంపించింది బెలూన్లే కదా అని ఈజీగా కొట్టిపడేయకండి. ఇప్పుడు ఆ బెలూన్లే ఇంటర్నెట్ లో సంచలనాలు సృష్టిస్తున్నాయి. అసలు ఈ తరహా ఆలోచనలు కిమ్ క ఎలా వస్తాయబ్బా అని నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు. ఇంతకీ ఆ బెలూన్లో ఏమున్నాయో తెలుసా? యుద్దం అంటే ఏంటీ? కత్తులు, గన్స్ తో తలపడతారు. లేదా జెట్స్ తో ఫైట్ చేస్తారు. అది కాదంటే మాటల యుద్ధానికి దిగుతారు. ఇదే కదా యుద్ధం అంటే.. కానీ అక్కడ అలా కాదు. చెత్తతో యుద్ధం చేసుకుంటారు. మరి అంతే కదా చెత్తతో యుద్ధమేంటీ చెప్పేవారు లేకగానీ అసలు వీరి మధ్య చెత్త యుద్ధం ఎలా స్టార్ట్ అయింది. అసలు అది ఎలా నడుస్తోంది చెప్తే.. నవ్వు.. బాధ రెండు కలుగుతాయి. గత కొంత కాలంగా ఉభయ కొరియా దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. అగ్ర రాజ్యం అయిన అమెరికాతో దక్షిణ కొరియా చేపట్టే సైనిక విన్యాసాలకు స్పందనగా ఉత్తర కొరియా తరుచూ క్షిపణులతో దాడులు చేస్తూనే ఉంటుంది. కిమ్ జోంగ్ ఉన్ పొరుగు రాజ్యమైన దక్షిణ కొరియాపై ఓ వింతైన ప్రతీకారం తీర్చుకున్నాడు. ఈసారి క్షిపణులు, బాంబులతో కాదు. ఓ 'చెత్త' ఐడియాతో వచ్చాడు. కిమ్ తన పొరుగు దేశంలో బెలూన్ల ద్వారా చెత్త, విసర్జన పదార్థాలను జారవిడిచి ప్రతీకారం తీర్చుకున్నాడు. దీంతో దక్షిణ కొరియాలోని కొంతమంది బెలూన్ల ద్వారా ఉత్తర కొరియాలోకి లేఖలు పంపడం మొదలు పెట్టారు. దీనికి ప్రతీకార చర్యగా కీమ్ ఈ చెత్త దాడి చేసినట్లు తెలుస్తుంది. బుధవారం ఉదయం ఉత్తర కొరియా, బెలూన్లు ప్రయోగించినట్లు దక్షిణ కొరియా సైన్యం తెలిపింది. అవి సరిహద్దు దాటిన తర్వాత సియోల్కు ఉత్తరంగా ఎగిరాయని పేర్కొంది.బెలూన్ల నుంచి పడే వస్తువుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అయితే ఈ చెత్త దాడిలో ఎలాంటి నష్టం జరగలేదని దక్షిణ కొరియా తెలిపింది నిజానికి మే నెల చివరి వారం నుంచి ఈ బెలూన్ల యుద్ధం సాగుతోంది. ఉత్తర కొరియా ఇలా బెలూన్లు పంపడం ఇది పదో సారి ఇప్పటి వరకు 2,000 కంటె ఎక్కువగానే బెలూన్లను ప్రయోగించారు. ఆ బెలూన్లలో ఎరువులు, సిగరెట్ పీకలు, చెత్త వస్తువులు, వ్యర్థాలు ఉంటున్నాయి. అయితే దక్షిణకొరియా పంపిన బెలూన్లకు ప్రతీకారంగానే మేము బెలూన్లను పంపుతున్నామని ఉత్తర కొరియా చెబుతోంది.కొత్త కొరియా చెత్త బెలూన్లకు గతంలో దక్షిణ కొరియా గట్టి జవాబునిచ్చింది. సరిహద్దుల్లో పెద్ద పెద్ద లౌడ్‌స్పీకర్లను ఏర్పాటు చేసి ఉత్తర కొరియా వ్యతిరేక ప్రచారాలను ప్రారంభించింది. సైనిక స్థావరాలు ఉన్న ఉత్తర కొరియా ప్రాంతాల్లో లౌడ్ స్పీకర్ల ద్వారా ఐ-పాప్ సంగీతం, విదేశీ వార్తలతోపాటు, ప్యాంగ్యాంగ్ వ్యతిరేక ప్రసారాలను దక్షిణ కొరియా సైన్యం హోరెత్తిస్తోంది.అయితే ఉత్తర కొరియాలో విదేశీ వార్తలు, ఐ-పాప్ పాటలు వినడం తీవ్ర నేరాలుగా పరిగణిస్తారు. అవి దేశంలోని ప్రజల పట్ల ప్రభుత్వ వ్యతిరేక భావాలను నాటుతుందని, తన అధికారాన్ని బలహీనపరుస్తుందని నియంత కిమ్ జోంగ్ ఉన్ భావిస్తారు. అందుకే వాటిని అక్కడ నిషేధించారు.

2015లో ఇలాగే దక్షిణ కొరియా లౌడ్ స్పీకర్లతో ఉత్తర కొరియా వ్యతిరేక ప్రచారం చేయగా ప్రతిచర్యగా కిమ్ ప్రభుత్వం ఫిరంగులను పేల్చింది. అప్పట్లో అది ఉద్రిక్త పరిస్థితులకు తావిచ్చింది. మళ్లీ ఆ పరిస్థితులే ఎదురైతే ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని దక్షిణ కొరియా బలగాలను ఆదేశించింది.నిజానికి వీరి మధ్య ఇలా చెత్తతో యుద్ధం జరగడం మొదటిసారేం కాదు.. 1950లో కొరియన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి దక్షిణ కొరియా, ఉత్తర కొరియా మధ్య బెలూన్లతో యుద్ధం జరుగుతోంది. ఒక దేశం పైకి మరొక దేశం ఈ రకమైన బెలూన్లను పంపుతున్నారు. ఈ చెత్త దాడి గురించి ఇటీవల సౌత్ కొరియా ఐక్యరాజ్య సమితి బృందానికి తెలియజేసింది. అనుమానాస్పద వస్తువులపై స్థానిక ప్రజలను అప్రమత్తం చేసింది. ఇలాంటి వస్తువులతో ఇళ్లకు, ఎయిర్ పోర్ట్, రోడ్లకు ప్రమాదం అని దక్షిణ కొరియా సైనికులు అంటున్నారు. వీటి వల్ల ఉత్పన్నమయ్యే పర్యవసనాలకు కిమ్ దే బాధ్యత అని పేర్కొన్నారు. ఇలాంటి చిల్లర పనులు, అమానవీయ పనులు కిమ్ వెంటనే ఆపాలని హెచ్చరించింది.ఇప్పటికే రష్యా-ఉక్రెయిన్ బాంబులతో యుద్ధం చేస్తోంది. మరో పక్క ఇజ్రాయెల్-హమాస్ నెత్తురోడుతోంది. ఈ సమయంలో వీళ్ల చెత్తయుద్ధం చర్చగా మారింది. అసలే కిమ్ కి తిక్కెక్కువ అని అందరికీ తెలుసు.. మరి ఆయన దీనికి ఎప్పుడు ఫుల్ స్టాప్ పెడతారో.. తెలియదు.

## పోలీస్ వాహనాల నిర్వహణ బాధ్యతయుతంగా ఉండాలి

- వాహనాల నిర్వహణలో జాగ్రత్తగా ఉంటూ ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి

- జిల్లాలో పోలీస్ వాహనాల డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల:** జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో మంగళవారం రోజున జిల్లాలోని పోలీస్ పోలీస్ అధికారుల వాహనాల డ్రైవర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎస్ పి ముఖ్య అతిధిగా పాల్గొని విధి నిర్వహణతో పాటించవలసిన అంశాలపై దిశ నిర్దేశం చేశారు. అనంతరం పోలీస్ వాహనాల డ్రైవర్ల సంక్షేమంలో భాగంగా ఏర్పాటు చేసిన కంటి వైద్య పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించి వారితో పాటుగా కంటి పరీక్షలు చేపించుకున్నారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతు అత్యవసర సమయాలలో పోలీసులు సంఘటనా స్థలాలకు త్వరగా వెళ్లే క్రమంలో డ్రైవర్ల బాధ్యత చాలా ముఖ్యమని అందుకే ప్రతి ఒక్కరి కంటి చూపు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లాలోని అన్ని పోలీస్ వాహనాల డ్రైవర్లకు ఎల్. వి ప్రసాద్ సిరిసిల్ల వారి సహకారంతో కంటి వైద్య పరీక్షలు చెపిస్తున్నామని తెలిపారు. వైద్య పరీక్షలలో లోపం ఉన్న వారికి అవసరమైన చికిత్స తీసుకునేలా సూచనలు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ అందరికి ఆదర్శంగా ఉండాలని అదే సమయంలో పోలీస్ వాహనాన్ని చూస్తేనే పోలీస్ శాఖ గౌరవం, ప్రతిష్టను పెరిగే విధంగా వాహనాల నిర్వహణ ఉండాలని ఆయన అన్నారు.పోలీస్ ఉద్యోగం అత్యవసర సేవలలో ముఖ్యమైనది కాబట్టి డ్రైవర్లంతా అధికారులు సూచించిన విధంగా సమయ పాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలందించడంలో ముందుండాలని సూచించారు.డ్రైవర్లంతా వాహనాలలో ఇంజన్ ఆయిల్ మొదలుకొని, స్పేర్ పార్టులు, వాహనాన్ని శుభ్రంగా ఉంచుకోవడం, ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేయించడం లాంటి విషయాలలో జాగ్రత్తలు పాటిస్తూ వాహనాన్ని సొంత వాహనంగా చూసుకోవాని అన్నారు. పోలీస్ స్టేషన్ల వారీగా ఉన్న వాహనాలను కండిషన్ లో ఉంచుతూ, నిర్వహణ సక్రమంగా ఉన్న వాహనాలను గుర్తించి సంబంధిత డ్రైవర్లకు ఎస్పీ గారు అభినందించి ప్రసంశ పత్రాలు అందించారు. ఎస్పీ వెంట ఆర్.ఐ మాధుకర్, యాదగిరి, ఆర్.ఎస్.ఐ రాజు, సిబ్బంది ఉన్నారు.

## అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

### - అశవర్కర్స్ యూనియన్ మండల కన్వీనర్ సొల్లు శాంత




**తెలంగాణా క్యాపిటల్ న్యూస్ ఇల్లంతకుంట:** ఆశ వర్కర్స్ సమస్యలని పరిష్కరించాలని చలో అసెంబ్లీ పిలుపులో భాగంగా హైదారాబాద్ వెళ్తున్న ఆశాలను ముందస్తు అక్రమ అరెస్టు చెయ్యటం సిగ్గుచేట అన్నారు. ఈ సందర్భంగా ఆశావర్కర్స్ యూనియన్ మండల కన్వీనర్ సొల్లు శాంత మాట్లాడుతూ ఛలో అసెంబ్లీలో పిలుపు మేరకు ఉదయం హైదారాబాద్ బస్సు కి వెళ్తున్న సమయంలో అక్రమ అరెస్టు రాత్రికి రాత్రి రాష్ట్ర వ్యాప్తంగా మమ్మల్ని అరెస్టు చెయ్యటంపై ఉన్న శ్రద్ధ మా సమస్యలపై పరిష్కారం చూపటం పై లేదని 19 సం ల నుండి మా సమస్యలని పరిష్కారానికై ఉద్యమాలు, ధర్నా, రాస్తారోకో, దీక్షలు చేపట్టిన గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి. ESI, PF, TA DA లు, 50,00,000 భీమ కల్పించాలి అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలి, కరోనా సమయంలో మాకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే ప్రభుత్వం చెల్లించాలని అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఆశాల సమస్యపై మాట్లాడకపోవడం బాధాకరం అన్నారు. అశాలకు నష్టం కలిగించే ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలి. గతంలో ఇచ్చినట్లు ఆశలకు ప్రతినెల 2వ తేదీన పారితోషకం చెల్లించండి. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశలకు ఇట్టి ఖర్చులు రూపాయలు 50 వేయిలు చెల్లిస్తూ సర్కులర్ జారీ చేయాలి. ఆశలకు ప్రతి సంవత్సరం 20 రోజుల వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలి. మా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించకుంటే ధర్నాలు, రాస్తారోకో లు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరిస్తున్నం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు గొర్రె లక్ష్మి, న్యాత లక్ష్మి, కాంపెల్లి మంజుల, కుర్మ రేణుక, దాసరి అనంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో మరథాన్ రెండవ ఎడిషన్

### - కరపత్రం ఆవిష్కరించిన కలెక్టర్

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ కరీంనగర్ :** కరీంనగర్ లో సెకండ్ ఎడిషన్ మారథాన్ నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత సంవత్సరం అట్టహాసంగా చేపట్టిన మారథాన్ సక్సెస్ అయిన సంగతి తెలిసిందే. ఈసారి కూడా అదే విధంగా మారథాన్ నిర్వహించేదుకు సమాయత్తం అవుతున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం మారథాన్ కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. డిఆర్వో పవన్ కుమార్ డి వై ఎస్ ఓ శ్రీకాంత్ రెడ్డి , కరీంనగర్ రన్నర్స్ మరియు సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కే.ఆర్.సి.ఎ ప్రెసిడెంట్ పసుల మహేష్ మరియు సభ్యులు డిడి మార్కెటింగ్ పద్మావతి, రవీందర్, అఖిల్ ప్రారంభానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కే.ఆర్.సి.ఎ ప్రెసిడెంట్ మహేష్ పసుల మాట్లాడుతూ గత సంవత్సరం ఒకటవ ఎడిషన్ గ్రాండ్ సక్సెస్ అయిన తర్వాత, మారథాన్ రెండవ ఎడిషన్‌ను




ప్రకటించడం చాలా ఉత్సాహంగా ఉందని అన్నారు. రన్‌లో నలుగురు కేటగిరీలు ఉంటాయి: 3k, 5k, 10k మరియు 21K. కింది లింక్ https://knr24.iq301.com/ని ఉపయోగించి మాత్రమే నమోదు ద్వారా పాల్గొనడం అనుమతించబడుతుందని పాల్గొనేవారు T- షర్టు, మెడల్, డిజిటల్ సర్టిఫికేట్ పొందుతారు. అల్పాహారం మరియు హైడ్రేషన్ మద్దతు అందించబడుతుంది. అదనపు సమాచారం కోసం, దయచేసి సంప్రదించండి : 72592 65758, 81436 58008 లేదా 96764 99949 నెంబర్లను సంప్రదించవలిసిందిగా తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి

### - జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ వేములవాడ:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు విద్యార్థులకు కార్పోరేట్ ప్రమాణాల స్థాయిలో నాణ్యమైన విద్యా బోధన అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం వేములవాడ మండలం చీర్లవంచ ఆర్ & ఆర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, తరగతి గదులను, పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాల తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో అన్ని వసతులు, సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉంది అని ప్రశ్నించారు. ఏ తరగతిలో ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆరా తీశారు. కిచెన్, స్టోర్ రూమ్ ను పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన



సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. తనిఖీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్‌గా లింగంపెల్లి శ్రీకాంత్



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ గన్నేరువరం:** కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ గా పారువెల్ల గ్రామానికి చెందిన లింగంపెల్లి శ్రీకాంత్ ను నియమిస్తూ రాష్ట లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ సోమవారం నియామక ఉత్తర్వులు జారీచేశారు. తన నియకమానికి సహకరించిన మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, మానకొండూరు శాసన సభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ మరియు రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ కు శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎల్ ఓ సి మంజూరు చేపించిన ప్రభుత్వ విప్

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ వీర్నపల్లి:** రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామానికి చెందిన టి.ప్రవీణ్ అనారోగ్య సమస్యల వలన అత్యవసర చికిత్స అవసరం ఉన్నదని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారికి తెలియజేయగానే తక్షణమే స్పందించి నిమ్స్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో చర్చలు జరిపి ప్రత్యేకమైన చికిత్స అందించవలసిందిగా ఆదేశిస్తూ మరియు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయంగా వెంటనే వైద్య ఖర్చులకు 60,000/- రూపాయలు మంజూరు చేపించారు.అత్యవసర ఆరోగ్య చికిత్స నిమిత్తం ఎల్ఓసి మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన బీజేపీ నాయకులు



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ కోనరావుపేట:** కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి సత్తయ్య అనే రైతు నిన్నటి రోజున అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలియగానే కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ మరియు జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్ రావు లతో ఫోన్ ద్వారా మాట్లాడి వారి కుటుంబానికి పదివేల రూపాయల రూపాయలు ఆర్థిక సహాయాన్ని బీజేపీ మండల అధ్యక్షులు గొట్టే రాంచంద్రం ఆధ్వర్యంలో వారి కుటుంబానికి మంగళవారం రోజున అందించారు. బాధిత కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ భరోసా కలిపించారు. వీరి వెంట బీజేపీ నాయకులు రేగుల మల్లికార్జున్,మర్త సత్తయ్య,శీలం రాజు,నంద్యాడపు వెంకటేష్, బొల్లారం తిరుపతి వెలిశాల రవి ఆకుల నాగరాజు,దుర్గం తిరుపతి, పాలకుర్తి శ్రీనివాస్,ఎగ్గే మల్లేశం, ముస్కామ్ శ్రీనివాస్,బడే నర్సయ్య, తాళ్లపెల్లి సుమన్,వెలిశాల శేఖర్,విజయ్ తదితరులు పాల్గొన్నారు

## ఉత్తమ రీజినల్ డ్రైవర్ గా ఎంపికైన జయరాములు



**వనపర్తి జూలై 30:** పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన RTC సీనియర్ డ్రైవర్ సూర్యావంశం జయరాములు మహబూబ్ నగర్ రీజియన్ స్థాయిలో ఉత్తమ డ్రైవర్ గా ఎంపికయ్యారు.ప్రమాద రహిత డ్రైవర్ గా, సమయపాలన తో, అంకిత భావంతో విధులు నిర్వహించడం చేత వారికి ఈ అవార్డు చే ఆర్టీసీ ఉన్నతాధికారులు సత్కరించారు.గతంలో కూడా వనపర్తి డిపో ఉత్తమ డ్రైవర్ గా ఎంపికయ్యారు.ఈ సందర్భంగా జయరాములు అభినందనలు.

# కేటీఆర్ కే పూర్తి బాధ్యతలు



**హైదరాబాద్:** తిపక్షనేత హోదాలో మొదటి సారి అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్.. మళ్లీ ఫాంహౌస్‌కి వెళ్లిపోయారు. దాంతో అధికారంలో ఉన్నంత కాలం యువరాజులా చెలాయించిన కేటీఆర్‌పై పాపం పెద్ద భారమే పడినట్టు కనిపిస్తుంది. గత ప్రభుత్వ అక్రమాలపై విచారణలకు సమాధానం చెప్పుకోవాలి. అటు అధికారపక్షం నేతల విమర్శలకు వివరణలు ఇచ్చుకోవాలి. మరోవైపు పదేళ్లు మిత్రత్వం కొనసాగించిన ఎంఐఎం కూడా ఇప్పుడు బీఆర్ఎస్‌పై విరుచుకుపడుతోంది. ఇప్పటికే పార్టీ ఎమ్మెల్యేలు కారు దిగిపోతుండటంతో సతమతమవుతున్న కేటీఆర్.. ఈ ముప్పేట దాడితో ఒంటరి అయిపోతున్నారు. తెలంగాణలో కాళేశ్వరం కేంద్రంగా డైలాగ్ వార్ కంటిన్యూ అవుతుంది. ఇరు పార్టీల మధ్య వాటర్ వార్ హైవోల్టేజ్‌కి చేరుకుంది. బీఆర్ఎస్ చలో మేడిగడ్డతో కాళేశ్వరం పంచాయితీ కాక రేపుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మేడిగడ్డ నుంచి రోజుకు 10 లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా సముద్రంలోకి పోతున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపు నీటి ఎత్తిపోతలను ప్రారంభించాలన్నారు. ఆగస్టు 2 వరకు గడువిస్తున్నామని, స్పందించకుంటే కేసీఆర్ నాయకత్వంలో 50 వేల మంది రైతులతో కలిసి మోటార్లను ప్రారంభిస్తామని హెచ్చరించారు కేటీఆర్. కుంగుబాటు వెనుక కాంగ్రెస్ కుట్ర ఉందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. రాబోయే రోజుల్లో మేడిగడ్డకు కాంగ్రెస్‌తో ప్రమాదం పొంచి ఉందని కామెంట్ చేశారాయన. తమ ప్రభుత్వంపై నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నారని ఆక్షేపించారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. కాళేశ్వరం ఎత్తిపోతల ఘోర తప్పిదమని.. ఏ సీఎం కూడా ఇలా చేసి ఉండరంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరంపై పూర్తిస్థాయి అధ్యయనం చేసి ప్రాజెక్టును తమ ప్రభుత్వం పూర్తి చేస్తుందని చెప్పారు. ఇక మరో సీనియర్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అయితే బీఆర్ఎస్‌ను కూరలో కరివేపాకులా తీసి పారేస్తున్నారు. మేడిగడ్డ కుంగినప్పుడు అధికారంలో ఉన్నది బీఆర్ఎస్‌నేనని.. కేటీఆర్ ఆరోపించినట్లు కుట్రలు చేస్తే డ్యామ్ లోపలికి ఎలా కుంగుతుందని ప్రశ్నించారు. అయినా పోటీ చేసిన సగం సీట్లలో డిపాజిట్లు రాని ఆ పార్టీ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని తీసిపారేశారు. కాళేశ్వరం పేరుతో రెండు లక్షల కోట్ల రూపాయలు గంగపాలు చేశారని ఆ డబ్బులతో వేలాది ఇందిరమ్మ ఇండ్లు కట్టేవాళ్లం అని పేర్కొన్నారు. ఆధారాలతో సహా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పుకోలేక బీఆర్ఎస్ సతమతమవుతుంది. ఇప్పుడు ఎంఐఎం కూడా వారికి తోడైంది. బీఆర్ఎస్ హయంలో పాతబస్తీ అభివృద్ధికి నోచుకోలేదని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ విమర్శించారు. వాళ్ల దృష్టి మొత్తం గచ్చిబౌలి వైపే ఉందని మండిపడ్డారు. ఓల్డ్ సిటీలో దుర్భర పరిస్థితులు ఉన్నా పట్టించుకున్న నాదుడే గత పదేళ్లలో లేడని. కేటీఆర్‌ను అడిగితే ఇదిగో అదిగో అని కాలం వెళ్లదీశారనిఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ మాటలు అద్భుతంగా చెప్పేవారు కానీ.. పనులు మాత్రం శూన్యమని సెటైర్లు విసిరారు. కాంగ్రెస్ నేతలకే కేటీఆర్ పళ్లబిగువున సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది. పవర్‌లో ఉన్నప్పుడు పాతబస్తీపై బోల్డు ప్రేమ ఒలకపోసిన ఆయన ఇప్పుడు అక్బర్ ఆరోపణలకు ఏం సమాధానం చెప్తారో చూడాలి. మొత్తానికి బీఆర్ఎస్ ఒంటరి అయిపోయిటన్లే కనిపిస్తోందిప్పుడు.

# గుడుంబా పోయో... గంజాయి వచ్చే

**హైదరాబాద్:** ధూల్‌పేట్.. ఒకప్పుడు హైదరాబాద్ ఓల్డ్‌సిటీలో గుడుంబా తయారీకి కేరాఫ్ అడ్రస్. కానీ.. ప్రభుత్వాలు, ఎక్సైజ్ శాఖల సమన్వయంతో రూపొందించిన వ్యూహాలకు గుడుంబా తయారీ సమూలంగా తుడిచిపెట్టుకుపోయింది. అయితే.. గుడుంబాకు గుడ్ బై చెప్పిన కుటుంబాలు.. ఇప్పుడు గంజాయి వైపు దృష్టిపెట్టడం పోలీసులను కలవరపెడుతోంది. దాంతో.. ఒకప్పుడు ఆపరేషన్ గుడుంబా చేపట్టి విముక్తి కలిగించిన ఎక్సైజ్ శాఖ.. ఇప్పుడు ఆపరేషన్ గంజాయితో ఉక్కుపాదంమోపుతోంది. ప్రస్తుతం ధూల్‌పేట్లోనే కాదు.. హైదరాబాద్ సిటీ వ్యాప్తంగా, శివారు ప్రాంతాల్లోనూ గంజాయి దందా జోరుగా కొనసాగుతోంది. అయితే.. గంజాయి, డ్రగ్స్ విషయంలో ఉక్కు పాదం మోపాలని అధికారులకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా కమలాసన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత దాడులు మరింత వేగవంతం చేశారు. ఈ క్రమంలో.. సిటీలో ఎక్కడ గంజాయి దొరికినా దాని మూలాలన్నీ ధూల్‌పేట్‌లో బయటపడుతుండడంతో ప్రత్యేక దృష్టి సారించారు పోలీసులు. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల ఆధ్వర్యంలో ఆపరేషన్ ధూల్‌పేట్ పేరుతో స్పెషల్ ఆపరేషన్ చేపట్టారు. గతంలో గంజాయి స్మగ్లింగ్ చేసి పట్టుబడ్డవారితోపాటు.. పెడ్లర్స్, కన్స్యూమర్స్‌పై ఫోకస్ పెట్టి.. ఇంటింటికి, గల్లీగల్లీ తిరుగుతూ తనిఖీలు చేస్తున్నారు. దాంతో..



ధూల్‌పేట్ కేంద్రంగా చేపట్టిన మెరుపు దాడుల్లో కిలోల కొద్దీ గంజాయి పట్టుబడుతోంది. ఇక? ఆగస్టు 31లోపు ధూల్‌పేట్‌ను గంజాయి రహిత ప్రాంతంగా మారుస్తామన్నారు తెలంగాణ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి. ధూల్‌పేట్‌తోపాటు.. హైదరాబాద్ సిటీలోని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. మరోవైపు.. ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా అవుతుండడంతో దాన్ని అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టారు పోలీసులు. ఏపీ, ఒడిశా, కర్నాటక, మహారాష్ట్ర నుంచి రాకపోకలు సాగించే రైళ్లలోనూ తనిఖీలు ముమ్మరం చేశారు. తాజాగా.. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో దాడులు చేసిన పోలీసులు.. గంజాయి స్మగ్లింగ్‌లో కీలక నిందితుడైన రాహుల్‌సింగ్‌ను అరెస్ట్ చేశారు. మొత్తంగా.. మెరుపు దాడులతో హైదరాబాద్‌లో గంజాయి స్మగ్లర్స్‌కు వణుకుపుట్టిస్తున్నారు పోలీసులు.

# ఆర్టీసీకి మరో 1325 బస్సులు

**హైదరాబాద్:** తెలంగాణలో ప్రజా రవాణా వ్యవస్థకు పెరుగుతున్న ప్రయాణికుల తాకిడి నేపథ్యంలో మరిన్ని బస్సు సర్వీసులను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత కొన్నాళ్లుగా ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సంఖ్య గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం పథకం తరువాత కొన్ని రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా అధిక సంఖ్యలో మహిళలు ప్రయాణాలు సాగించడం, అదే సమయంలో పురుషులు, విద్యార్థులు, ఇతరులు సాగించే ప్రయాణాలకు అనుగుణంగా బస్సులు సరిపోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో బస్సుల్లో పెరిగిన రద్దీను తట్టుకునేందుకు అనుగుణంగా టీజీఎస్ఆర్టిసి కొత్త బస్ సర్వీసులను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. కొత్త బస్సులు కావాలన్న టీజీఎస్ఆర్టీసీ అభ్యర్థన మేరకు జూన్ నాటికి 1325 కొత్త బస్సులను దశలవారీగా తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే వీటిలో ఇప్పటి వరకు ఆర్టీసీకి చేరిన బస్సుల సంఖ్య అతి స్వల్పం. ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని మరోసారి టీజీఎస్ఆర్టిసి నూతన బస్ సర్వీసులు అందించాల్సిందిగా విజ్ఞప్తి చేసింది. ఈ విజ్ఞప్తి మేరకు కొద్ది రోజుల్లోనే ప్రభుత్వం నూతన బస్సు సర్వీసులను అందించేందుకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వాన్ని అందించాలని కోరిన 1325 బస్సుల్లో 712 పల్లె వెలుగులు, 400 ఎక్స్ప్రెస్, 75 డీలక్స్, 138 లహరి, రాజధాని బస్సులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో ఇప్పటికే కొన్ని బస్సులు అందుబాటులోకి రాగా, మిగిలిన బస్సులు కొద్ది రోజుల్లోనే టీజీఎస్ఆర్టీసీ చేతికి అందం ఉన్నట్లు చెబుతున్నారు. వీటిలో కొన్ని బస్సులను మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకానికి వినియోగించనున్నారు. గత కొద్ది నెలలుగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సంఖ్య గణనీయంగా పెరిగినట్లు టీజీఎస్ఆర్టిసి అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగర పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ప్రతిరోజు వేలాదిమంది ప్రయాణాలు సాగిస్తున్నారు. బస్సుల సంఖ్య తక్కువగా ఉండడం ప్రయాణికులు సంఖ్య అధికంగా ఉండడంతో చాలామంది ప్రమాదకర స్థాయిలో ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ తరహా ప్రయాణాలు ప్రమాదకరంగా పరిణమించే అవకాశం ఉన్న



నేపథ్యంలో వీటికి చెక్ చెప్పేందుకు అధికారులు సిద్ధపడుతున్నారు. నూతన ఆర్టీసీ బస్సులను అందించాల్సిందిగా ఆర్టీసీ అధికారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగర పరిధిలోనే కాకుండా రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో బస్సులు కొరత వేధిస్తోంది. కొన్నిచోట్ల ఏళ్ల తరబడి వినియోగిస్తున్న బస్సులతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. వీటిని పక్కన పెట్టి కొత్త బస్సులను తీసుకువచ్చే ప్రతిపాదనను ఇప్పటికే టీజీఎస్ఆర్టిసి అధికారులు పెట్టారు. ఈ ప్రతిపాదనలను అధికారులు ఇప్పటివరకు అమలు చేయకపోవడంతో ప్రజా రవాణాలో కొన్ని రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోని అనేక జిల్లాల్లో ప్రజల రవాణాకు కీలకంగా వ్యవహరిస్తున్న పల్లె వెలుగు బస్సులు కూడా కొరత వేధిస్తోంది. కొన్నిచోట్ల డొక్కు బస్సులతోనే ప్రజలకు సేవలను అందించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఇబ్బందులను కూడా టీజీఎస్ఆర్టిసి అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం నూతన బస్సులను కొద్ది రోజుల్లోనే కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతోంది. తద్వారా తమ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకానికి మరిన్ని బస్సులను కేటాయించడంతోపాటు పల్లె వెలుగు, ఇతర సేవలకు సంబంధించిన బస్సులను భారీగా టీజీఎస్ఆర్టిసికి ప్రభుత్వం అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అన్ని అనుకూలిస్తే ఆగస్టులోనే ఈ బస్సులు ప్రజలకు సేవలు అందించే అవకాశం ఉందని చెబుతున్నారు. అదే జరిగితే రాష్ట్రంలోని ప్రజా రవాణాను వినియోగించే ప్రజలకు ఎంతగానో మేలు చేకూరనుంది.

# పెరగనున్న చెప్పుల ధరలు

**హైదరాబాద్:** నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు మండిపోతున్నాయి. దీంతో సామాన్య ప్రజలపై మోయలేని భారం పడుతుందని చెప్పవచ్చు. ఇప్పుడు మరో భారం పడనుంది. ఫుట్‌వేర్ సంబంధించి కొత్త నాణ్యతా ప్రమాణాలు తీసుకొస్తోంది కేంద్రం. దీంతో చెప్పులు, షూల ధరలు భారీగా పెరగనున్నాయని పలు నివేదికలు చెబుతున్నాయి. ఆగస్టు 1 నుంచి కొత్త నాణ్యతా ప్రమాణాలు అమలులోకి రానున్నాయి. అంటే అప్పటి నుంచి తయారయ్యే షూ, స్లిప్పర్లు, సాండిల్స్ కొత్త ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ స్పష్టం చేసింది. కొత్త నాణ్యతా నియంత్రణ ఉత్తర్వుల ప్రకారం.. చెప్పులు, షూ తయారు చేసే వారు మా 6721, మా 10702 నిబంధనలు కచ్చితంగా పాటించాలని బీఐఎస్ స్పష్టం చేసింది. చెప్పులు, షూ తయారీలో ఉపయోగించే రెగ్జిన్, ఇన్‌సోల్ వంటి ముడి పదార్థాలకు రసాయన పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి. అలాగే చెప్పులు, షూల బయటి భాగాలకు వినియోగించే మెటీరియల్ చిరగకుండా, ఎక్కువ కాలం మన్నికగా ఉండేలా చూసుకోవాలి. అలాగే టెస్టింగ్ లో ఆ మెటీరియల్ పాస్ అవ్వాల్సి ఉంటుంది. అంటే ఇకపై ఇష్టారీతిలో నాణ్యతలేని చెప్పులు, షూ తయారు చేయడం కుదరదు. వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా, ఎక్కువ కాలం మన్నికయ్యే చెప్పులు, షూ అందుబాటులోకి తీసుకొచ్చేందుకే ఈ కొత్త రూల్స్ తీసుకొస్తున్నట్లు బీఐఎస్ వర్గాలు తెలిపాయి. అయితే, కొత్త ప్రమాణాల ప్రకారం చెప్పుల తయారీ ఖర్చులు పెరగనున్నాయి. ఆ భారాన్ని తగ్గించుకునేందుకు కంపెనీలు ధరలు పెంచవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే, రూ.50 కోట్ల కంటే తక్కువ



వార్షిక టర్నోవర్ ఉన్న కం?పనీలకు ఈ కొత్త నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చింది కేంద్రం. పాత స్టాక్‌కి సైతం ఈ రూల్స్ వర్తించవని, ఆగస్టు 1 తర్వాత తయారయ్యే వాటికే ఈ కొత్త రూల్స్ వర్తిస్తాయని తెలిపింది. అయితే, విక్రయదారులు తమ వద్ద ఉన్న పాత స్టాక్ వివరాలను బీఐఎస్ వెబ్‌సైట్లో పొందుపరచాల్సి ఉంటుంది. నాణ్యమైన వస్తువులు పొందడం కొనుగోలుదారుడి హక్కు అని బీఐఎస్ చెబుతోంది. వివిధ వస్తువులు, ఉత్పత్తులు, పరికరాలు బీఐఎస్ నిర్దేశిత ప్రమాణాల మేరకు ఉండాలి. దేశ దాదాపు 344 వస్తువులకు బీఐఎస్ నాణ్యత గుర్తు కచ్చితంగా ఉండాలి. విదేశాల నుంచి దిగుమతి అవుతున్న ఫోన్లు సహా వివిధ ఎలక్ట్రానిక్ వస్తువులకు బీఐఎస్ సింబల్ కచ్చితంగా ఉండాలి. సుమారు 20 వేల ప్రమాణాలను బీఐఎస్ ధ్రువీకరించి అందుబాటులోకి తీసుకొచ్చింది.

# సెల్ ఫోన్ల రికవరీలో సిరిసిల్ల టాప్



**కరీంనగర్:** గత కొన్ని రోజుల నుండి పోగొట్టుకున్న, దొంగలించబడిన ఫోన్లను రికవరీ చేసి సంబంధిత బాధితులకు అప్పగించారు సిరిసిల్ల పోలీసులు.. గత ఏడాది ఏప్రిల్ 20 నుండి జులై 28వ తేదీ వరకు జిల్లాలో 1,200 సెల్ ఫోన్లు సిఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి 1019 ఫోన్లు సంబంధిత బాధితులకు అప్పగించారు. సెల్ఫోన్ పోయిందంటే టెన్షన్ పడవద్దని.. వెంటనే సీఈఐఆర్ లాగిన్ అయి వివరాలు నమోదు చేసుకుంటే తొందర్లోనే ఫోన్ ఎక్కడుందో కనిపెట్టొచ్చని పోలీసులు నిరూపిస్తున్నారు. సిరిసిల్ల జిల్లాలో ఈ రోజు వరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 1200 ఫోన్లు గుర్తించి 1019 ఫోన్లను సబంధిత బాధితులకు అందించారు. 84శాతం రికవరీ ఫోన్లతో రాష్టంలోనే మొదటి స్థానంలో జిల్లా నిలిచించింది. రికవరీ చేసిన సొత్తు విలువ సుమారుగా కోటి రూపాయలు. రాష్ట్రంలో కమిషనరేట్స్ కాకుండా మిగితా మిగిలిన జిల్లాలతో పోల్చుకుంటే సిరిసిల్ల జిల్లాలో అత్యధికంగా 1000 పైగా ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అప్పగించడం విశేషం. మీ బంధువులు, స్నేహితుల్లో ఎవరిదైనా ఫోన్ దొంగతనం జరిగినా.. ఎక్కడైనా పోగొట్టుకున్నా.. వెంటనే పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేయాలని బాధితులకు జిల్లా ఎస్పీ సూచించారు. కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన సీఈఐఆర్ అనే పోర్టల్ ద్వారా సెల్ఫోన్ పోయినా, దొంగతనానికి గురైనా వెతికి పట్టుకునేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. సెల్ఫోన్ పోయిన వ్యక్తి ముందుగా సంబంధిత పోలీస్ స్టేషన్ లో ముందుగా ఫిర్యాదు చేయాలి, లేదా మీసేవ కేంద్రానికి వెళ్లి లిలిలి.ఇవతితీ.ఐనీల.తిని అనే వెబ్సైట్లో లాగిన్ కావాలి. అందులో రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్/ స్టోలెన్ అనే లింకై క్లిక్ చేసి, సెల్ఫోన్ నెంబర్, ఐఎంఈఐ నెంబర్, కంపెనీ పేరు, మోడల్, కొన్న బిల్లు అప్లోడ్ చేయాలి. దీంతో పాటు ఏ రోజు, ఎక్కడ పోయింది. రాష్ట్రం, జిల్లా, పోలీస్టేషన్లో ఫిర్యాదు చేసిన వివరాలు నమోదు చేయాలి. చివరిగా వినియోగదారుడి పేరు, చిరునామా, గుర్తింపు కార్డు, ఈమెయిల్ ఐడీ, ఓటీపీ కోసం మరో సెల్ఫోన్ నెంబర్ ఇవ్వాలి ఇదంతా పూర్తయిన తరువాత ఒక ఐడీ నెంబర్ వస్తుంది. తద్వారా సంబంధిత ఐడీ ఫోన్ స్టేటస్ తెలుసుకోవచ్చన్నారుసీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా జిల్లాలో పోయిన మొబైల్ ఫోన్స్ 84% రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో కృషి చేసిన ఐటీ కోర్ జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు. పోయిన ఫోను ఇక దొరకదు అనుకున్నామని.. పోలీసులు టెక్నాలజీ ఉపయోగించి తమ ఫోన్ రికవరీ చేసి అందించినందుకు జిల్లా ఎస్పీకి, పోలీస్ సిబ్బందికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. సెల్ ఫోన్ పోయిందా...సీఈఐఆర్ పోర్టల్ లో నమోదు చేయండిసెల్ ఫోన్ పోయిందా.. అయితే టెన్షన్ పడవద్దు. వెంటనే సీఈఐఆర్ లాగిన్ అయి వివరాలు నమోదు చేసుకుంటే తొందర్లోనే ఫోన్ ఎక్కడుందో కనిపెట్టొచ్చని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. కేంద్ర టెలికాం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన సీఈఐఆర్ అనే పోర్టల్ ద్వారా సెల్ ఫోన్ పోయినా, దొంగతనానికి గురైనా వెతికి పట్టుకునేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సెల్ ఫోన్ పోయిన వ్యక్తి ముందుగా సంబంధిత పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలి, లేదా మీసేవ కేంద్రానికి వెళ్లి లిలిలి.ఇవతితీ.ఐనీల.తిని అనే వెబ్ సైట్లో లాగిన్ కావాలి. అందులో రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్/ స్టోలెన్ అనే లింక్ పై క్లిక్ చేసి, సెల్ ఫోన్ నెంబర్, ఐఎంఈఐ నెంబర్, కంపెనీ పేరు, మోడల్, కొన్న బిల్లు అప్లోడ్ చేయాలి. దీంతో పాటు ఏరోజు, ఎక్కడ పోయింది....రాష్ట్రం, జిల్లా, పోలీస్టేషన్ లో ఫిర్యాదు చేసిన వివరాలు నమోదు చేయాలి. చివరిగా వినియోగదారుడి పేరు, చిరునామా, గుర్తింపు కార్డు, ఈమెయిల్ ఐడీ, ఓటీపీ కోసం మరో సెల్ ఫోన్ నెంబర్ ఇవ్వాలి. ఇదంతా పూర్తయిన తరువాత ఒక ఐడీ నెంబర్ వస్తుంది. తద్వారా సంబంధిత ఐడీ ఫోన్ స్టేటస్ తెలుసుకోవచ్చన్నారు.

# రవీంద్రభారతికి దీటుగా కాళోజీ కళాక్షేత్రం

**వరంగల్:** సాంస్కృతిక ప్రదర్శనలకు నిలయమైన హైదరాబాద్ రవీంద్రభారతిని మించేలా ఓరుగల్లులో కళాక్షేత్రం రెడీ అవుతోంది. తెలంగాణ ఏర్పడిన కొత్తలో ప్రజా కవి కాళోజీ నారాయణరావు పేరున కళాక్షేత్రం నిర్మాణానికి శంకుస్థాపన చేయగా, దాదాపు పదేళ్ల నుంచి పనులు నత్తనడకన సాగుతూనే ఉన్నాయి. కాళోజీ జయంతి, వర్ధంతి కార్యక్రమాల సందర్భంగా గత పాలకులు కళాక్షేత్రాన్ని సందర్శించడం, ఆ తరువాత పనులు పూర్తి చేస్తామంటూ హామీలు ఇవ్వడం తప్ప.. పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఓరుగల్లు ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం జనాల్లో మెప్పు సాధించేలా కాళోజీ కళాక్షేత్రం నిర్మాణంపై ఫోకస్ పెట్టింది. ఈ మేరకు వచ్చే సెప్టెంబర్ 9న కాళోజీ జయంతి సందర్భంగా కళాక్షేత్రాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు పనులన్నీ ఆగస్టు 15 వరకే పూర్తి చేయాలని డెడ్ లైన్ పెట్టింది. దీంతో అధికారులు ఓరుగల్లు రవీంద్ర భారతి కాళోజీ కళాక్షేత్రం పనులను స్పీడప్ చేస్తున్నారు. కళలకు పుట్టినిల్లుగా చెప్పుకునే ఓరుగల్లు జిల్లాలో కళాకారుల ప్రదర్శనలకు సరైన వేదిక లేకుండా పోయింది. దీంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014 సెప్టెంబర్ 9న ప్రజాకవి కాళోజీ జయంతి సందర్భంగా హనుమకొండలో ఆయన పేరున కళాక్షేత్రం నిర్మించేందుకు గత సర్కారు అడుగులు వేసింది. ఈ మేరకు 2014 సెప్టెంబర్ 9న అప్పటి సీఎం కేసీఆర్ హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్ లో శంకుస్థాపన చేశారు. నాలుగున్నర ఎకరాల విస్తీర్ణం కలిగిన ఆ స్థలంలో 12,990 చదరపు మీటర్ల వైశాల్యంలో రవీంద్రభారతిని తలదన్నేలా కళాక్షేత్రాన్ని నిర్మిస్తామని, ఈ పనులన్నీ ఏడాదిలోగానే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కళలు, సాంస్కృతిక కళా ప్రదర్శలనకే కాకుండా వివాహాలు, ఇతర కార్యక్రమాలు, సమావేశాలకు కూడా ఉపయోగపడేలా, సుమారు రెండు వేల మంది కూర్చునేలా ఆడిటోరియం నిర్మించాలని ఆదేశించారు. ఈ మేరకు మొత్తం నిర్మాణానికి రూ.50 కోట్ల వరకు ఖర్చవుతాయని అంచనా వేయగా, అప్పటి సీఎం ఆదేశాలతో కాళోజీ కళాక్షేత్రానికి పునాదులు పడ్డాయిహైదరాబాద్లోని రవీంద్రభారతి కంటే మిన్నగా ఉండేలా కాళోజీ కళాక్షేత్రానికి ప్లాన్ రెడీ చేశారు. జీ ప్లస్ ఫోర్ మోడల్ బిల్డింగ్ పనులు చేపట్టి, పనులను మూడు దశల్లో పూర్తి చేసేందుకు నిర్ణయించారు. అందులో మొదటి దశలో భాగంగా బిల్డింగ్ సూపర్ స్ట్రక్చర్ నిర్మాణ



పనులు, రెండో దశలో ఇంటీరియర్, ఎలక్ట్రికల్ పనులు, మూడో దశలో ల్యాండ్ స్కేపింగ్, పాథ్ వే, పార్కింగ్ తదితర పనులు పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అంతేగాకుండా గ్రౌండ్ ఫ్లోర్ లో 2 వేల మందికి సరిపడా ఆడిటోరియం, ఆర్ట్ గ్యాలరీ, రిహార్సల్స్ రూం, ఫస్ట్ ఫ్లోర్ లో ప్రీ ఫంక్షన్స్ వేదిక, ఆఫీస్ రూంలు, ఫుడ్ కౌంటర్, స్టోర్ రూమ్స్, రెండో అంతస్తులో లైబ్రరీ, ఆఫీస్, మూడు, నాలుగో అంతస్తులో ఫంక్షన్స్ హాల్స్, బాల్కనీ, టెర్రాస్, క్యాట్వాక్ లాబీ తదితర ఫెసిలిటీస్ ఉండేలా అద్భుత ప్లాన్ తో పనులు మొదలుపెట్టారు. కళాక్షేత్రం నిర్మాణానికి మొదట రూ.50 కోట్లు మంజూరు చేయగా, హైదరాబాద్ కు చెందిన మెస్సర్స్ సిర్కో అనే సంస్థ టెండర్ దక్కించుకుంది. ఆ తర్వాత వరంగల్ కు చెందిన లోకల్ కాంట్రాక్టర్లకు సబ్ కాంట్రాక్ట్ ఇచ్చి పనులు అప్పగించింది. ఈ మేరకు పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ఆగుతూ.. సాగుతూ వచ్చాయి. దీంతో నిర్మాణ పనులను కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ టేకాఫ్ చేసింది. కానీ నిర్మాణ పనుల్లో క్వాలిటీ పాటించకపోవడంతో రెండేళ్ల కిందట కొన్నిచోట్ల పిల్లర్లు కుంగిపోయి, బిల్డింగ్ రూఫ్ కూడా దెబ్బతింది. దీంతో అప్పట్లో కుడా వీసీగా పని చేసిన ప్రావీణ్య దృష్టికి వెళ్లడంతో ఆమె ఆదేశాల మేరకు వరంగల్ ఎన్ఐటీ ఇంజినీరింగ్ సిబ్బంది కళాక్షేత్రాన్ని పరిశీలించి, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని రిపోర్ట్ ఇచ్చారు. కళాక్షేత్రంలో పిల్లర్లు బలంగా ఉండాలంటే రెట్రో ఫిట్టింగ్ తప్పనిసరిగా చేయాలని సూచించారు. దీంతో రూ.50 కోట్ల బడ్జెట్ ను రూ.70 కోట్లకు పెంచాల్సి వచ్చింది.